కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

కాల్వశ్రీరాంపూర్: జాఫర్‌ఖాన్‌పేట కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న దాసరి ఉష

కాల్వశ్రీరాంపూర్, మే 25: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, రోహిణి కార్తె వచ్చింది, మళ్లీ పంటలు వేసుకునే సమయం ఆసన్నమైంది, వడ్లు ఇంకెప్పుడు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. తూకాలు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలన్నారు. అకాల వర్షాలకు మొలకెత్తిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిప్పని శ్రావణ్, ఎంబాడి చంద్రయ్య, నరేశ్, మల్లెపూల కుమార్, గౌడ ప్రభాకర్, తోట శ్రీకాంత్, తిప్పని శ్రీనివాస్, యాదగిరి సతీశ్, శ్రీనివాస్, పోచాలు,కుమార్,తిప్పని శ్రీనివాస్ ఉన్నారు.

వణికించిన గాలి దుమారం

- విరిగిపడ్డ చెట్లు.. విద్యుత్‌కు అంతరాయం

ఓదెలలో గాలి ధాటికి లేచిపోయిన ఇంటి పైకప్పు రేకులు

ఓదెల, మే 25: ఓదెల మండలంలో శుక్రవారం రాత్రి గాలి దుమారం వణికించింది. రాత్రివేళ ఒక్కసారిగా బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఓదెల మండల కేంద్రంలో బియ్యాల సమ్మయ్య ఇంటి రేకులు గాలికి లేచిపోయి కొంత దూరాన పడ్డాయి. నాంసానిపల్లిలో పెనుకుల నరేశ్ ఇంటి రేకులు లేచిపోయాయి. ఓదెల మల్లికార్జునస్వామి ఆలయం–పెగడపల్లి మధ్య అనేక చోట్ల రోడ్ల వెంబడి చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. లంబాడితండా సమీపంలోని విద్యుత్ టవర్ లైన్ తెగిపోయి రాత్రి మంటలు చెలరేగినట్లు స్థానికులు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ ఎల్‌టి, 11కేవీ స్తంభాలు విరిగిపోయినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. లంబాడితండా, అబ్బిడిపల్లి, నాంసానిపల్లి గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోగా అధికారులు పునరుద్ధరించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శన్, డీఈ తిరుపతి, ఏడీఈ మధుకర్, ఏఈలు మోహన్‌నాయక్, రాజమల్లులు శనివారం స్థానికంగా ఉండి విద్యుత్ పునరుద్ధరణ పనులను చేయించారు. కాగా ఇండ్లకు నష్టం జరిగిన పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

సాంస్కృతిక రంగంలో మేలుకొలుపు 'ఇప్టా'

- ఆవిర్భావ దినోత్సవ సభలో వక్తలు

కోల్‌సిటీ, మే 25 : సాంస్కృతిక రంగంలో మేలు కొలుపు, మేలి మలుపు 'ఇప్టా' అని నాయకులు కే స్వామి, కే కనకరాజ్ అన్నారు. ఈమేరకు భాస్కరరావు భవన్‌లో శనివారం ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) 81వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇనుముల రాజమౌళి పతాకాన్ని ఆవిష్కరించారు. అమరులైన కళాకారులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళుల ర్పించారు. ప్రజానాట్య మండలి నగర కార్యదర్శి రాజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ నాయకులు గౌతం గోవర్ధన్, తాళ్లపల్లి మల్లయ్య, తొడుపునూరి రమేశ్, సూర్య, ఓదెమ్మ, కనకరాజు, కళాకారులు కొంరయ్య, మొండయ్య, మోహన్, రమ తదితరులున్నారు.

సెగ్రిగేషన్ షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్, మే 25: గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కార్యదర్శులను ఎంపీవో సుదర్శన్ ఆదేశించారు. శనివారం పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట, ముత్తారం ధర్మాబాద్, హన్మంతునిపేట, రాంపల్లిని సందర్శించి సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు గైనిక్, అనుభవం గల నర్సులు (GNM/B.Sc Nursing) కావలెను. స్వయంగా సంప్రదించండి: పుల్లెల హాస్పిటల్, KNR.
NTK-317429

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

నోటీసులివ్వకుండా కూల్చేస్తారా?

- బాధితుల ఆందోళన
- బేగంపేట ఎక్స్‌రోడ్‌లో దుకాణాలు నేలమట్టం

రామగిరి : జేసీబీ తో కూల్చివేస్తున్న దుకాణ సముదాయాలు

రామగిరి మే 25: మండంలోని బేగంపేట ఎక్స్ రోడ్ (నాగెపల్లి)లో రోడ్డు విస్తరణ పేరిట దుకాణ సముదాయాలు కూల్చేస్తారా? అంటూ బాధితులు ఆర్‌అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. శనివారం మంథని సీఐ, రామగిరి ఎస్ఐ సమక్షంలో రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ సిబ్బందితో చేరుకొని ఎక్స్‌కవేటర్‌తో దుకాణాలను కూల్చివేస్తుండగా యజమానులు అడ్డుకున్నారు. తమకు ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, కనీసం మార్కింగ్ కూడా చేయలేదని ఆరోపించారు. అయితే వీరి అభ్యంతరాలను పట్టించుకోకుండా కూల్చివేతలు కొనసాగించారు. కాగా, బేగంపేట ఎక్స్‌రోడ్‌లో నాగెపల్లి నుంచి ముత్తారం మండలంలోని కేశనపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం ఉన్నది. దీనిపై బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు, జడ్పీ చైర్మన్ పుట్టమధూకర్ పేర్లున్నాయి. అందుకే కుట్రపూరితంగా శిలాఫలకాన్ని కూల్చివేసేందుకు అధికారులు కుట్రలు చేస్తున్నారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

బొగ్గు ఉత్పత్తి వీడియో కాన్ఫరెన్స్

గోదావరిఖని, మే 25 : సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్లు సత్యనారాయణ, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర రెడ్డి అన్ని ఏరియాల జీఎంలతో ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, ఓబీ తొలగింపు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి ఆర్జీ–1 ఏరియాలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు, బొగ్గు రవాణా, ఓబీ తొలగింపు ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. వానకాలం దృష్ట్యా ఉత్పత్తికి అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై వివరించారు. సమావేశంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఏజీఎం ఆంజనేయులున్నారు.

చిత్ర కళాకారుడికి సత్కారం

రామగిరి, మే 25 : హన్మకొండలోని ఎల్‌బీ కాలేజీలో సాగంటి మంజుల ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన మొదటి వార్షికోత్సవంలో మండలంలోని బేగంపేట చిత్ర కళాకారుడు కొత్తూరి మోహన్‌ను ప్రశంసా పత్రంతో సత్కరించారు. సుమారు వంద మంది చిన్నారులు వివిధ రకాల పెయింటింగ్ చిత్రాలు వేసి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

'పొదుపు' నగదును వాడుకున్నారని..

- మంథనిలో జ్యోతి గ్రామైక్య సంఘం సభ్యుల ఆందోళన

పాత చెక్ బుక్ ద్వారా నిర్వహించిన ట్రాన్సాక్షన్‌ను చూపుతున్న మహిళలు

మంథని, మే 25: పొదుపు సంఘాల్లోని నగదును వాడుకుంటున్నారని ఆరోపిస్తూ ఖానాపూర్‌కు జ్యోతి గ్రామైక్య సంఘం సభ్యులు శనివారం మంథనిలోని ఏపీఎం ఆఫీసు వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ, సంఘంలో 23 గ్రూపుల సభ్యులంతా పొదుపు చేసుకుంటున్నామన్నారు. సీఏ రాధారపు భాగ్యలక్ష్మి, అధ్యక్షురాలు బాసాని లక్ష్మి, కార్యదర్శి బిరుదు జ్యోతి, కోశాధికారి మాదరి పద్మ మాకు తెలియకుండా రూ.1.30వేలను విత్‌డ్రా చేశారన్నారు. ప్రశ్నిస్తే సీఏ జీతం చెల్లించేందుకు విత్‌డ్రా చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారన్నారు. సంఘంలో రూ.30 లక్షల వరకు నగదు ఉన్నదని, ఇందులోని రూ.10 లక్షలు మహిళలకు రుణాలు ఇచ్చారని, ఇందులో ఎంత మంది కడుతున్నారు అనే విషయాలు కూడా ఏం తెలియనివ్వడం లేదన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దుర్వినియోగం అవాస్తవం

ఖానాపూర్ జ్యోతి గ్రామైక్య సంఘం ఖాతా నుంచి సీఏకు మూడేండ్ల వేతనం రూ.1.30 లక్షలు చెల్లించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు సంఘ సభ్యుల సంతకాలు తీసుకొని చెక్ ఇచ్చినం. ఆడిట్ రిపోర్టులోకి వెళ్లడంతో అందులోని రూ.21వేలను సంఘం ఖాతాలోకి ఆమె తిరిగి చెల్లించింది. దుర్వినియోగం అవాస్తవం. మహిళలకు లోన్లు ఇవ్వగా ప్రస్తుతం వీవోలో రూ.22,73,244 ఉన్నాయి. రూ.30 లక్షలను సంఘం సభ్యులను పంచాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కుదరదు. లోన్లు మాత్రమే ఇచ్చే అవకాశం ఉంటుంది.

-మంథని ఏపీఎం పద్మ

రామగుండంలో డివిజన్ల పెంపు సాధ్యమేనా..?

- మేయర్ రిజర్వేషన్ మారనుందా?
- కార్పొరేషన్‌లో ఆసక్తికరమైన చర్చ

రామగుండం కార్పొరేషన్ కార్యాలయం

కోల్‌సిటీ, మే 25: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లను 60కి పెంచుతున్నట్లు వస్తున్న ఊహాగానాల నేపథ్యంలో అది సాధ్యమయ్యే పనేనా..? ఇదే జరిగితే మేయర్ రిజర్వేషన్ మారుతుందా..? అధికార కాంగ్రెస్‌కు కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారనుందా..? ప్రస్తుతం పారిశ్రామిక ప్రాంతంలో ఇదే అంశంపై వాడివేడి చర్చ జరుగుతున్నది. రామగుండం మేయర్‌ను బీసీ జనరల్‌గా మార్చుతున్నారనే ప్రచారం నేపథ్యంలో అందరి దృష్టి ఇప్పుడు బల్దియాపై పడింది. 2020 డిసెంబర్‌లో రామగుండం కార్పొరేష న్‌కు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుత పాలక వర్గం గడువు ఏడు నెలలు ఉన్నది. అయితే ఇప్పుడే కార్పొరేషన్‌లో టికెట్ల పంచాయితీ మొదలైంది. 2019లో మేయర్ స్థానాన్ని ఎస్సీ జనరల్‌గా నిర్ణయించారు. చట్ట ప్రకారం ఇదే రిజర్వేషన్ రెండు పర్యాయాలు ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రిజర్వేషన్ కూడా మారుతుందనే ఊహగానాలు వస్తున్నాయి. రాష్ట్రంలో కార్పొరేషన్ల సంఖ్య పెరిగితే కూడా రామగుండం మేయర్ రిజర్వేషన్ మారే అవకాశం ఉంటది. ఒకవేళ 60 డివిజన్లుగా చేస్తే రిజరేవషన్ మార్చాల్సి ఉంటుంది. గతంలో కార్పొరేషన్‌లో విలీనమైన లింగాపూర్, కుందనపల్లి గ్రామాలను ప్రజల అభ్యంతరంతో తిరిగి పంచాయతీలుగా చేశారు. అయితే రెండు రోజుల నుంచి రామగుండం మేయర్ బీసీ (మహిళ)గా మారుస్తున్నారనే చర్చ నడుస్తున్నది.

రేషన్ బియ్యం పట్టివేత

మంథని రూరల్, మే 25: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మంథని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. శనివారం తెల్లవారుజామున బొలెరో వాహనంలో దాదాపు 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండలంలోని సిరిపురం గ్రామం నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా స్థానికులు పట్టుకొని సమాచారం అందించారన్నారు. పట్టుకున్న బియ్యం వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించడంతోపాటు సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఓదెల, మే 25: మడక గ్రామానికి చెందిన మ్యాడగోని మొగిలిగౌడ్ తాటిచెట్టు పైనుంచి పడి శనివారం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం రాత్రి కురిసిన వాన కారణంగా తాటిచెట్టు తడిసి ఉండడంతో చెట్టు ఎక్కుతుండగా కాలు పట్టుజారి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డట్లు తెలిపారు. వెంటనే కరీంనగర్ దవాఖానకు తరలించి చికిత్స ఇస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్ కోరారు.

అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలి

- మండల వ్యవసాయాధికారి కాంతాల అలివేణి

పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి కాంతాల అలివేణి, పాల్గొన్న రైతులు

పెద్దపల్లిరూరల్, మే 25: రైతులు విత్తనాలు, ఎరువులను అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని పెద్దపల్లి మండల వ్యవసాయాధికారి కాంతాల అలివేణి సూచించారు. పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంట, రాఘవాపూర్, బొంపల్లి, ముత్తారం, దస్తగిరిపల్లి గ్రామాల్లో శనివారం రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు వానకాలం సీజన్ కోసం పంట సాగుకు ఆమోదయోగ్యమైన అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. గుర్తుతెలియని వారి వద్ద విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే రైతులు అన్ని రకాలుగా నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. ఎవరైనా వ్యాపారులు రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల తీసుకునేటప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని అన్నారు. సమావేశాల్లో వ్యవసాయ విస్తీర్ణాధికారులు శిరీష, స్వేత, వినయ్ స్పందన, కల్పనలతో పాటు ఆయా క్లస్టర్ల రైతులు పాల్గొన్నారు.

మంచి విత్తనాలను సరఫరా చేయాలి

పెద్దపల్లి రూరల్, మే 25 : రైతులకు మంచి దిగుబడులనిచ్చే విత్తనాలు, ఎరువులను సరఫరా చేయాలని పెద్దపల్లి మండల వ్యవసాయ శాఖాధికారి కాంతాల అలివేణి సూచించారు. మండలం, పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను శనివారం ఆమె అకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్టాకు రిజిష్టర్లు, బ్యాచ్ నంబర్లను పరిశీలించారు. రైతుకు నష్టం కల్గించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో హెచ్చరించారు. ఇక్కడ ఏఈవోలు సిబ్బంది ఉన్నారు.

ఇండ్లల్లో కోతలు.. వీధిలో దీపాలు

గోదావరిఖని 44వ డివిజన్ జవహర్ నగర్‌లో ఉదయం 11 గంటలకు కూడా వెలుగుతూనే ఉన్న వీధి దీపాలు

కోల్‌సిటీ, మే 25 : రామగుండం నగర పాలక సంస్థ 44వ డివిజన్ గోదావరిఖని జవహర్‌నగర్‌లో శనివారం విద్యుత్ అంతరాయం కారణంగా ఇండ్లలో ఉక్కపోతలతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతూంటే, వీధిలో మాత్రం కరెంటు స్తంభాలపై విద్యుత్ లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఈ ఏరియాలో శనివారం ఉదయం 4 గంటల పాటు విద్యుత్ కోతలు విధించారు. ఇదే జవహర్‌నగర్‌లో ఉదయం 11 గంటలకు కూడా పగలే వెన్నెల అన్నట్టుగా.. వీధిలైట్లు వెలుగుతుండడాన్ని 'నమస్తే' క్లిక్‌మనిపించింది. ఒకవైపు కరెంటు కోతలకు తోడు ఎండ తీవ్రతకు ప్రజలు ఇండ్లలో ఉండలేని పరిస్థితి ఉంటే.. మరోవైపు ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యంతో వీధిలైట్లు పగలు కూడా వెలుగుతూనే ఉండడాన్ని చూసి జనం విమర్శించారు.

వానకాలం పంటలపై అవగాహన

అంతర్గాం, మే 25 : వానకాలం పంటల సాగుపై శనివారం మండలంలోని విలేజ్ అంతర్గాం, విస్సాంపేట, పొట్యాల గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి రాంబాబు రైతులకు అవగాహన కల్పించారు. విత్తన కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, మే 25 : విత్తనాల ఎంపిక, కొనుగోలులో రైతులు జాగ్రతలు తీసుకోవాలని కూనారం క్లస్టర్ ఏఈవో ఎర్ర రాజు రైతులకు సూచించారు. మండలంలోని కూనారం రైతు వేదికలో రైతులకు విత్తనాల ఎంపిక, కొనుగోలు విషయమై సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

ఉపాధి కూలీ మృతి

పెద్దపల్లి రూరల్, మే 25 : జొన్నగడ్డల మంగమ్మ (45) అనే కూలీ ఉపాధి హామీ పనులకు వెళ్తూ చెరువు మత్తడి వద్ద ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందింది. మంగమ్మ కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. మంగమ్మ రాఘవాపూర్ శివారులోని చెరువులో కొద్ది రోజులుగా ఉపాధిహామీ పనులు జరుగుతుండగా పనులకు వెళ్తున్నది. శనివారం కూడా రోజువారీగానే పనులకు వెళ్తూ చెరువు మత్తడి వద్దకు చేరుకోగానే అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలింది. సహచర కూలీలు మంగమ్మను దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మంగమ్మకు భర్త దేవేందర్‌తోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలీ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆర్థిక చేయూతనందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

రచ్చపల్లికి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని వినతి

మంథని రూరల్, మే 25: రచ్చపల్లికి గ్రామ పంచాయతీ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని గవర్నర్‌కు వినతి పత్రాన్ని అందించినట్లు మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీగా ఆవిర్భవించిన రచ్చపల్లికి గ్రామ పంచాయతీగా గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్‌లో గవర్నర్‌కు వినతి పత్రం అందించినట్లు ఆయన తెలిపారు.

ఉన్నత లక్ష్యాలతో చదవాలి

- స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న అరుణ శ్రీ

పెద్దపల్లిరూరల్, మే 25: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఎస్సీ స్టడీ సర్కిల్‌ను సందర్శించారు. విద్యార్థులను వసతులు భోధనకు సంబంధించిన అంశాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి నాగైలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీఎండీకి వినతి

రామగిరి, మే 25 : సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం సంస్థ సీఅండ్‌ఎండీ బలరాం నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ సెక్టార్ సిస్టం, ఫ్యాక్టరీ యాక్ట్ సిస్టం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ఆర్థికంగా నష్టపోవడంతోపాటు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. కార్మికులకు తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

అంజన్నకు కిలో వెండి కిరీటం బహూకరణ

జూలపల్లిలో వెండి కిరీటం, శంఖు చక్రాలు అందజేస్తున్న త్రినేశ్, అతని కుటుంబ సభ్యులు

జూలపల్లి, మే 25 : జూలపల్లి గ్రామానికి చెందిన దేవసాని త్రినేశ్ ఆంజనేయస్వామికి కిలో వెండి కిరీటం, శంఖు చక్రాలు బహూకరించాడు. దాదాపు రూ.లక్ష పైచిలుకు ఖర్చు చేసి ప్రత్యేకంగా తయారు చేయించాడు. శనివారం ఆలయంలో హనుమాన్ భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. ఇక్కడ జూలపల్లి సింగిల్ విండో చైర్మన్ కొంజర్ల వెంకటయ్య, నాయకులు లోక లింగారెడ్డి, దేవసాని శంకరయ్య, సిరికొండ కొమురయ్య, బెజ్జంకి రమేశ్, మేర శ్రీనివాస్, అమరగాని శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలపై కాంగ్రెస్ సర్కారు కేసులు

- బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ నాయకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి

వ్యాళ్ల హరీశ్‌రెడ్డి

పాలకుర్తి, మే 25 : ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం భయాందోళనకు గురిచేస్తున్నదని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ నాయకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల గాంధీ దవాఖానలో కరెంటు పోయిన ఘటనతో పాటు టీఎస్ ఆర్టీసీకి చెందిన లోగో వివాదాస్పదమైన నేపథ్యంలో తాను చేసిన పోస్టులను అడ్రస్ చేసుకుంటూ కేసులు పెట్టారన్నారు. గాంధీ దవాఖానలో కరెంటు పోయిన విషయం పాత వీడియో అని తెలుసుకొని వెంటనే డిలీట్ చేసినప్పటికీ కావాలని కక్షగట్టి తనపై కేసులు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉనికి కోసం పౌరులుగా కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేందుకు తాము పోరాటం చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పనులను తాము విమర్శిస్తున్నామే గానీ, తాము వ్యక్తిగతంగా ఏ విధమైన విమర్శలు చేయడం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పెద్దలు కావాలని సోషల్ మీడియాలో ప్రజా గొంతులను నొక్కాలని చూస్తే రాబోయే రోజుల్లో ప్రజలే గుణపాఠం చెప్తారన్నారు. ఇక ఒక టీవీ మాధ్యమంలో ప్రసారమైన టీఎస్ ఆర్టీసీ లోగోను తాను పోస్ట్ చేసినట్లు తనపై మరో కేసు నమోదు చేశారని, కేసులకు భయపడేది లేదని, కోర్టు పరిధిలో చట్ట ప్రకారం ఎదుర్కొంటామని తెలిపారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కేసీఆర్ నాయకత్వంలో రాబోయే రోజుల్లో మరింత పోరాటం చేస్తూ ప్రజల పక్షాన గొంతుకై నిలుస్తామన్నారు. ప్రజలు, పౌర హక్కుల నాయకులు ప్రతిపక్షాల గొంతులను నొక్కాలని చూస్తే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు

కాల్వశ్రీరాంపూర్: మొట్లపల్లి పాఠశాలలో నిర్మిస్తున్న మంచినీటి సంప్‌ను పరిశీలిస్తున్న ఏఈ మల్లేశం

కాల్వశ్రీరాంపూర్, మే25: మండలంలోని 38 అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి రూ.1కోటీ70 లక్షల నిధులు మంజూరైనట్లు పీఆర్ ఏఈ మల్లేశం తెలిపారు. మంజూరైన నిధులతో ఆమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆయా పాఠశాలల్లో విధ్యుత్, మంచినీటి సౌకర్యం, తరగతి గదులు, మరుగుదొడ్ల మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. మరమ్మతులు జరుగుతున్న పాఠశాలలను గురువారం పరిశీలించినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ ఆదేశానుసారం పాఠశాలల పునప్రారంభంలోగా పనులు పూర్తి చేయించాలని నిర్వాహకులను ఆదేశించినట్లు తెలిపారు.

టౌన్ షిప్‌లో 'ట్రీ ప్లాంటేషన్'

మొక్కనాటి నీరు పోస్తున్న ఎన్టీపీసీ జీఎం

జ్యోతినగర్, మే 25: ఎన్టీపీసీ యాజమాన్యం పచ్చదనం పరిశుభ్రత కోసం ఈనెల 16న చేపట్టిన స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో మాస్ ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టింది. టౌన్‌షిప్‌లోని బీట్టెపు గేట్ ఏరియాలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ జీఎం అలోక్‌కుమార్ త్రిపాఠి అతిథిగా హాజరై మొక్క నాటారు. అనంతరం ఉద్యోగులు మొక్కలు నాటారు. ఇక్కడ ఎన్టీపీసీ జీఎంతోపాటు ఏజీఎం హెచ్ఆర్ బిజోయ్‌కుమార్ సిద్దర్, ఉన్నతాధికారులు, ఉద్యోగులున్నారు.

రామగుండంలో నీటి తిప్పలు

రామగుండం కార్పొరేషన్‌లో నీటి తిప్పలు తప్పడం లేదు